పోలీసు ఔట్‌పోస్టు లేకపోవడంతో భయంగా ఉంది



తాడిపత్రి ఏరియా ఆసుపత్రిలో పోలీసు ఔట్‌పోస్టు లేకపోవడంతో రాత్రి సమయాల్లో భయంగా పని చేయాల్సి వస్తోంది. గతంలో పోలీసు ఔట్‌పోస్టు ఉండటంతో ధైర్యంతో పనిచేసేవాళ్లం. మూడు జిల్లాల సరిహద్దు కేంద్రం కావడంతో రాత్రి, పగలు తేడాలేకుండా రోగులు, వివిధ ప్రమాదాల్లో గాయపడిన వారు వస్తుంటారు. ఇలాంటి వారికి సరైన చికిత్స చేయలేదంటూ వారి బంధువులు మద్యం మత్తులో మహిళా వైద్య సిబ్బందిపై దుర్భాషలాడుతుంటారు. ఇటీవల సరిగా వైద్యం చేయలేదంటూ సిబ్బందిపై దాడికి యత్నించారు. వైద్యులు, సిబ్బందికి తగిన రక్షణ కల్పించాలి.

– మాధవి, స్టాఫ్‌నర్సు, తాడిపత్రి ఏరియా ఆస్పత్రి



సెక్యూరిటీ గ్రిల్స్ ఏర్పాటు చేయండి



గుంతకల్లు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి, నర్సింగ్ స్టేషన్ల వద్ద సెక్యూరిటీ గ్రిల్స్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఏదైనా అనుకోని సంఘటనలు జరిగినప్పుడు సెక్యూరిటీ గ్రిల్స్ ఉంటే నివారించడానికి అనువుగా ఉంటుంది. స్టాఫ్ తక్కువగా ఉండటం వల్ల అందరికీ వైద్యం అందించాలంటే ఇబ్బందిగా ఉంది. ఎమర్జెన్సీ కేసులు వచ్చినప్పుడు తమకే వైద్య పరీక్షలు చేయాలని చొరబడుతుంటారు. ఆ సమయాల్లో గొడవలు జరిగే అవకాశం ఉంటుంది. కిందిస్థాయి సిబ్బంది అయిన కట్టు కట్టేవారు, డ్రస్సింగ్ సిబ్బంది పోస్టులు భర్తీ చేయాలి. అన్ని వార్డులకు సెక్యూరిటీ సిబ్బంది నియమించాలి.

– జయవర్ధన్‌రెడ్డి, మాజీ సూపరింటెండెంట్, ప్రభుత్వ ఆస్పత్రి, గుంతకల్లు

కాలువ ఇలా.. నీరు పారేదెలా!

పెద్దవడుగూరు: పెద్దవడుగూరు, యాడికి మండలాలకు ప్రధాన సాగునీటి వనరైన హెచ్చెల్సీ కాలువ శిథిలావస్థకు చేరుకుంది. ఆయా మండలాల్లో దాదాపు 50 వేల ఎకరాల దాకా ఆయకట్టు ఉంది. కాలువ అధ్వానంగా ఉండటంతో నీరు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. కాలువ మొత్తం పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. చాలా చోట్ల సైడ్‌వాల్స్ దెబ్బతిన్నాయి. మాముదూరు చెరువు నీటి కోసం హెచ్చెల్సీ గట్టును తవ్వి పైపులు వేశారు. దీంతో పాటు కాలువలో వంక నీరు వెళ్లందుకు మట్టి మట్టి కూడా వేశారు. ఆ తర్వాత మట్టిని తొలగించకపోవడంతోపాటు పైపులను పూడ్చడం మరిచారు. గతంలో తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తన సొంత నిధులతో కాలువలో పెరిగిన జనుము గడ్డి, కంపచెట్లు తొలగింపజేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలో నీరు పారేలా తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



మాముదూరు చెరువు వద్ద కాలువ తవ్వి పైపులు వేసి పూడ్చడం మరిచిన వైనం



మిడుతూరు వద్ద కాలువ సైడు గోడలు దెబ్బతిన్న దృశ్యం



మిడుతూరు వద్ద హెచ్చెల్సీలో ఏపుగా పెరిగిన జనుము



మాముదూరు- మిడుతూరు మధ్యలో దెబ్బతిన్న హెచ్చెల్సీ గట్టు

గోడలు తొలగించకపోతే ఉద్ధృత పోరాటం

గుంతకల్లు: రైల్వే ఏరియాల్లో ప్రవేశించకుండా రహదారిపై అడ్డంగా నిర్మించిన గోడలను తొలగించాలని పట్టణ సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో విద్యార్థులతో కలసి డీఆర్‌ఎం కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు మాట్లాడుతూ.. రైల్వే ప్రాంతాల్లోకి ప్రవేశించకుండా బెంచ్ కొట్టాల, పోర్టర్‌లైన్ తదితర ప్రాంతాల్లో గోడలను నిర్మించి రాకపోకలను అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏరియాల్లోని ప్రజలు రైల్వేస్టేషన్, స్కూళ్లు, ఆస్పత్రి, దేవాలయాలకు వెళ్లాలంటే చుట్టి తిరిగి వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఈ విషయంపై డీఆర్‌ఎం కార్యాలయం ఎదుట ధర్నా చేసినా స్పందించ లేదని విమర్శించారు. అధికారులు వెంటనే స్పందించి గొడలను తొలగించపోతే ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. డీఆర్‌ఎం విజయ్‌కుమార్ అందుబాటులో లేకపోవడంతో ఇతర అధికారులకు వినతిపత్రం అందజేయాలని సీపీఎం నాయకులు ప్రయత్నించగా ఎవరూ ముందుకు రాలేదు. అధికారుల తీరుకు నిరసనగా డీఆర్‌ఎం కార్యాలయం గొడకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మారుతిప్రసాద్, కసాపురం రమేష్, సాకే నాగరాజు, రంగమ్మ ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఓతురు పరమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు వైటీ చెరువు రమేష్, నాయకులు వెంకీ, తదితరులు పాల్గొన్నారు.



గోడకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

ప్రణాళికాబద్ధంగా గ్రామాల అభివృద్ధి

సాక్షి బృందం: ఉపాధి హామీ నిధులతో ప్రణాళికాబద్ధంగా గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని అధికారులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. శుక్రవారం తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లోని గ్రామ పంచాయతీల్లో సర్పంచుల అధ్యక్షతన ఉపాధి పనుల ఎంపికపై గ్రామసభలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు తమ గ్రామాల్లో ఏఏ పనులు చేపట్టాలో అధికారులకు తెలియజేశారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 వేతనం కల్పించాలని సీపీఎం నాయకులు అధికారులకు వినతపత్రాలు సమర్పించారు. బుక్కరాయసముంద్రంలో జరిగిన గ్రామసభకు జెడ్పీ సీఈఓ ఓబుళమ్మ, తాడిపత్రి రూరల్ మండలం గన్నెవారిపల్లె కాలనీలో జరిగిన గ్రామసభకు తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, పుట్లూరు మండలం కడవకల్లులో జరిగిన గ్రామసభకు శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వలసల నివారణ కోసం ప్రభుత్వం చేపడుతున్న ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



గన్నెవారిపల్లె కాలనీ గ్రామసభలో పాల్గొన్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి

సరుకులు సక్రమంగా అందించాలి

తాడిపత్రి రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకులు సక్రమంగా అందించేలా చూడాలని అంగన్‌వాడీ కార్యకర్తలు సీఎస్‌డీటీ రాజాను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు సూపర్‌వైజర్ దస్తగిరమ్మకు పంపిణీ చేయని సరుకుల వివరాలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లకు కందిబేడలు, ప్రీ స్కూల్ బియ్యం పంపిణీ చేయలేదన్నారు. స్టాక్ పాయింట్ నుంచి తమకు సరుకులు రాకపోవడంతో తాము పంపిణీ చేయడం లేదని డీలర్లు చెబుతున్నారన్నారు. చేతి ఖర్చు పెట్టుకొని ఆటోలో స్టాక్ పాయింట్ వద్దకు వెళితే సరుకులన్నింటినీ ఆయా డీలర్లకు సరఫరా చేశామని, వారు సరుకులు ముట్టినట్టు వేలిముద్రలు వేసినట్టు ఆర్ఓలు చూపిస్తున్నారన్నారు. ఈ విషయాన్ని సీడీపీఓ సాజిదాబేగం, సూపర్‌వైజర్ దస్తగిరమ్మ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రతినెలా సరుకుల్లో తేడాలు వస్తుండటంతో అంగన్‌వాడీ సెంటర్లలోని పిల్లలకు ఎలా భోజనం వండిపెట్టాలో తెలియడం లేదన్నారు. పెండింగ్‌లోని సరుకులను సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు.



సీఎస్‌డీటీకి వినతి పత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

ఇంటి విషయమై ఇరువర్గాల ఘర్షణ

గుంతకల్లుటౌన్: పట్టణంలోని విద్యానగర్‌లో ఓ ఇంటి విషయమై క్రయ, విక్రేతల మధ్య జరిగిన ఘర్షణలో అమరేంద్ర రెడ్డి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు.. స్థానిక టీవీ స్టేషన్‌కు చెందిన అమరేంద్రరెడ్డి ఆ ఇంటిని మిల్లు ఏరియాకు చెందిన ప్రతాప్‌కు రిజిస్టర్ అయాకం చేయించి ఇచ్చాడు. అయితే ఇంటి పూర్వపు యజమాని మురళీ సతీమణి పార్వతి ఇంటిని ఖాళీ చేయలేదు. ఆ ఇంటి వద్దకు వెళ్లిన అమరేంద్రరెడ్డి ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేశారు. తమ వద్ద డబ్బు తీసుకుని రిజిస్టర్ అయాకం చేసి ఇవ్వనందుకు గానూ ప్రతాప్, అతని మిత్రులు అమరేంద్రరెడ్డితో గొడవ పడ్డారు. ఇరువురి మధ్య జరిగిన ఘర్షణలో ప్రతాప్ తరఫున వచ్చిన కసాపురం దేవేంద్ర, మరికొందరు కలిసి అమరేంద్ర రెడ్డిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అమరేంద్ర రెడ్డి ఫిర్యాదు మేరకు దేవేంద్రతో పాటు అతడి మిత్రులపై కేసు నమోదు చేశామని సీఐ చెప్పారు. అదే విధంగా తన ఇంట్లోని సామాన్లను ధ్వంసం చేశారని పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అమరేంద్ర రెడ్డిపై కూడా కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

అమ్మవార్లకు విశేష పూజలు

తాడిపత్రి అర్బన్: శ్రావణ శుక్రవారం సందర్భంగా పట్టణంలోని పలు ఆలయాల్లో శ్రావణమాస పూజలను ఘనంగా నిర్వహించారు. సంజీవనగర్ మొదటి రోడ్డులోని వేద గాయత్రీ దేవి ఆలయంలో ఉదయం నుంచి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేపట్టారు. సాయంత్రం ఆలయ ప్రధాన మండపంలో 108 మంది మహిళలతో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున గాయత్రీదేవి మాతను దర్శించుకున్నారు. మెయిన్‌బజార్‌లోని కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారి ధనలక్ష్మీదేవిగా అలంకరించి పూజలు చేపట్టారు. ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళలు లలితా సహస్రనామార్చన నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.



వేద గాయత్రీదేవి

చిరుధాన్యాల పంటలు సాగు చేయాలి

- జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరి

గార్లదిన్నె: జిల్లా వ్యాప్తంగా స్వల్పకాలిక పంటలైన చిరుధాన్యాల పంటల సాగు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఓబులాపురంలో ఆముదం పంటను పరిశీలించారు. ఈసందర్భంగా డీఏఓ మాట్లాడుతూ మండలంలో 27,527 ఎకరాల సాగు విస్తీర్ణానికి గాను 5,832 ఎకరాలు మాత్రమే రైతులు ఈ పంట నమోదు చేసుకున్నారన్నారు. సెప్టెంబర్ 15 నాటికి మిగిలిన రైతులంతా ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు ఉలవలు, జొన్న, కొర్ర పంటలను సాగు చేసుకోవాలన్నారు. త్వరలో ఉలవలు, జొన్నలు, కొర్రలు రైతు సేవా కేంద్రాలకు వస్తాయన్నారు. కార్య క్రమంలో మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

ప్రకాశం పంతులు సేవలు మరువలేనివి

బుక్కరాయసముద్రం: టంగుటూరు ప్రకాశం పంతులు సేవలు మరువలేనివని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రకాశం పంతులు జయంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం పాలిటెక్నిక్ విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ మాధవి, సస్య ఉత్పత్తి శాస్త్రవేత్త డాక్టర్ శశికళ, వ్యవసాయ విస్తరణా శాస్త్రవేత్త చందన సాయి, పాలిటెక్నిక్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: ప్రతి ఒక్కరూ టంగుటూరు ప్రకాశం పంతులను ఆదర్శంగా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ వెంకటలక్ష్మీ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక అంగన్‌వాడీ 5వ సెంటర్‌లో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు టంగుటూరు వేషధారణలో ఆకట్టుకున్నారు. టంగుటూరు చేసిన ఉద్యమాలను వివరించారు.

యల్లనూరు: స్థానిక గ్రంథాలయంలో టంగుటూరు ప్రకాశం పంతులు జయంతి వేడుకలను శుక్రవారం లైబ్రేరియన్ ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుపుకున్నారు.

గుత్తి: పట్టణంలోని సబ్ జైలులో శుక్రవారం ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరు ప్రకాశం పంతులు జయంతిని నిర్వహించారు. సబ్‌జైలు సూపరింటెండెంట్ మహేశ్వరుడు ఆధ్వర్యంలో జైలు సిబ్బంది, ఖైదీలు, తదితరులు ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మహేశ్వరుడు మాట్లాడుతూ.. సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా, రాజకీయ వేత్తగా ప్రకాశం పంతులు దేశానికి ఎంతో సేవ చేశారన్నారు.



రెడ్డిపల్లి కేవీకేలో ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శాస్త్రవేత్తలు, విద్యార్థులు

సంక్షిప్త సమాచారం

తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోండి

గుంతకల్లు రూరల్: ఆగస్టు నెలలో విస్తారంగా వర్షాలు కురిసి పంట పొలాలో వర్షం నీటితో నిండిపోవడంతో పంటలకు తెగుళ్లు సోకే ప్రమాదం ఉంది. రైతులు తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టాలని ఏఓ స్వాతి సూచించారు. శుక్రవారం నాగసముద్రం, వెంకటాంపల్లి గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించి, రైతులకు సూచనలు ఇచ్చారు. పంట సాగు చేసిన ప్రతి రైతు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. అప్పుడే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు.

ఫ్లోరోసిస్ బాధితులకు పరికరాల పంపిణీ

గుంతకల్లు రూరల్: నాగసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఫ్లోరోసిస్ బాధితులకు పునరావాస పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన్‌కుమార్ బాబు మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా ఫ్లోరోసిస్ బాధితులను గుర్తించి నడుము బెల్టులు, మెడ బెల్టులు, వాకర్లు, ఊత కర్రలు అందజేశామన్నారు. అవసమరైన వారికి శస్త్ర చికిత్సలు చేయిస్తామని తెలిపారు. జిల్లా ఫ్లోరోసిస్ అధికారి ఆంజనేయులు, సీహెచ్‌ఓ హైమవతి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల వసతి గృహం ఏర్పాటు చేయాలని ధర్నా

శింగనమల: శింగనమలలో బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ఎంఈఓ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యప్రకాష్ మాట్లాడుతూ గతంలో శింగనమలలోని జెడ్పీహెచ్‌ఎస్ క్రీడామైదానంలో బాలికల వసతి గృహం నిర్మించారని, కానీ ఏర్పాటు చేయలేదన్నారు. అనంతరం ఎంఈఓ నరసింహరాజుకు వినతి పత్రం అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలి

పెద్దవడుగూరు : తమ సమస్యలు పరిష్కరించాలని సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులు డిమాండ్ చేశారు. శుక్రవారం డుతూరు గ్రామం పంపౌస్ వద్ద రెండవ రోజు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తిఆచారి, రామకృష్ణారావు, రాజు, చంద్ర మాట్లాడుతూ 6 నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ

గుత్తి: ఎమ్మార్సీ భవనంలో శుక్రవారం ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు మండలంలో ఉపాధ్యాయుల ఖాళీలు, ఎక్కడెక్కడ ఉపాధ్యాయుల అవసరం, సర్దుబాటు తదితర అంశాలపై నివేదికను ఎంఈఓ రవి నాయక్ ఆన్‌లైన్‌లో పంపించారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు శ్రీధర్ గౌడ్, సయ్యద్ బాషా, ప్రసాద్, నాగరాజు పాల్గొన్నారు.

కలుపు నివారణపై అవగాహన

బుక్కరాయసముద్రం: రైతుల పొలాల్లో వయ్యారి భామ కలుపు నివారణపై రైతులకు అవగాహన పెంపొందించుకోవాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం రేకులకుంటలో వయ్యారి భామ కలుపు నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు మాట్లాడుతూ రైతులు పంట పొలాల్లో వయ్యారిభామ కలుపు మొక్కలు ఉన్నట్లయితే వాటిని వెంటనే తీసి వేయాలన్నారు. డాక్టర్ మాధవిలత, నారాయణస్వామి, డాక్టర్ నటరాజ్, డాక్టర్ భాస్కర్‌రావు, డాక్టర్ రమేష్ నాయక్, డాక్టర్ నజీర్ ఉన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు కంటి పరీక్షలు



పరీక్షలు చేస్తున్న డాక్టర్ మధుసూదన్‌రాజు

యాడికి: స్థానిక నం:4 ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం శైలజాకుమారి ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్య నిపుణుడు మదుసూదన్‌రాజు 62 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి 9 మందికి కంటి అద్దాలు అవసరం ఉన్నట్లు గుర్తించారు. కంటి అద్దాలు అవసరం ఉన్న విద్యార్థులకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ తరపున కళ్లద్దాలను ఉచితంగా అందిస్తామని ఆయన తెలిపారు. ఉపాధ్యాయులు ప్రతిభాభారతి, రంగస్వామిరెడ్డి పాల్గొన్నారు.

తాగునీటికి కటకట

పామిడి: మండలంలోని గ్రామీణ ప్రాంతాల ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. పది రోజులుగా మండలంలోని నీలూరు, తంబళ్లపల్లి, గజరాంపల్లి, రామరాజుపల్లి తదితర గ్రామాల ప్రజలకు సత్యసాయి వాటర్ ప్రాజెక్టు నీరందక పోవడంతో తల్లడిల్లిపోతున్నారు. ఆ ప్రాజెక్ట్ ఉద్యోగులకు జీతాలు అందకపోవడంతో వారు సమ్మెలో ఉన్నారు. ఆయా గ్రామాల ప్రజలు తాగునీటి కోసం హైవేలోని సత్యసాయి వాటర్ ప్రాజెక్ట్ పంప్ హౌస్‌లకు వెళ్తున్నారు. తాగునీటి ఎద్దడి తీర్చాలని గ్రామస్తులు కోరతున్నారు.

ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డికి సన్మానం



నార్పలలో ఎస్‌ఐను సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నార్పల: బదిలీపై వెళ్తున్న ఎస్‌ఐ రాజశేఖర్ రెడ్డిని ఎమ్మార్పీఎస్ నాయకులు రంగాపురం పుల్లప్ప ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. అనంతరం పుల్లప్ప మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా విధులు నిర్వర్తించి, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారికి అండగా నిలిచారన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ఎంతో కృషి చేశారన్నారు. ఆయన మరెన్నో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాజగోపాల్,శ్రీరాములు,రాజు,రమణ,నారాయణ,ఆదెప్ప తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక పరిశీలన

నార్పల: మండల కేంద్రంలోని శ్మశాన వాటికను ఎంపీడీఓ దివాకర్ శుక్రవారం పరిశీలించారు. సామాజిక కార్యకర్త గవ్వల శివ శ్మశాన వాటిక సమస్యలపై ఎంపీడీఓకు వినతిపత్రం ఇచ్చారు. దీంతో ఆయన స్పందించి, శ్మశాన వాటికను పరిశీలించారు. శ్మశాన వాటికలో ఇప్పటికే సమాధులు ఎక్కువగా నిర్మించారని, ఎవరైనా చనిపోతే పూడ్చడానికి కూడా స్థలం లేదన్నారు. శ్మశాన వాటికలో సమాధులు నిర్మించరాదన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీల్లో పూడిక తీయించాలి



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రమణయ్య

గుంతకల్లు టౌన్: స్థానిక కసాపురం రోడ్ రైల్వే మోరీ కిందనున్న డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడికను తీయించాలి. మురుగు పారేలా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఉదయం కసాపురం రోడ్డు, ఎస్‌ఎన్.పేటలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. మురుగు రోడ్లపై ప్రవహించకుండా క్లియర్ చేయించాలన్నారు. పారిశుధ్య పనుల నిర్వహణపై ఆయా కాలనీల ప్రజలను అడిగి తెలుసుకున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

శింగనమల: మండలంలోని పెద్దమ్మ ఆలయ హుండీ కానుకలను దేవదాయశాఖ అధికారులు శుక్రవారం లెక్కించారు. హుండీలో నగదు రూ.4,02,600 ఉన్నట్లు దేవదాయశాఖ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఈఓ శోభ తెలిపారు.

సకాలంలో గొర్రెకు వైద్యం

గార్లదిన్నె: గొర్రె ఈనడానికి ఇబ్బంది పడుతుంటే గార్లదిన్నె పశువైద్యాధికారి రమేష్ సకాలంలో వైద్యం చేశారు. పశువైద్యాధికారి రమేష్ మాట్లాడుతూ మర్తాడులో ఈనడానికి ఇబ్బంది పడుతుంటే గొర్రెను గార్లదిన్నె పశువైద్యశాలకు తీసుకొచ్చారన్నారు. గర్భం లోపల గొర్రె పిల్ల స్థానాన్ని సరి చేసి పిల్లను బయటకు తీశామన్నారు. గొర్రె పిల్ల గర్భంలోనే చనిపోయిందన్నారు.

చైతన్య విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి

గుంతకల్లు: పట్టణంలోని చైతన్య విద్యాసంస్థల యాజమాన్యం సమయ పాలన పాటించడం లేదని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ఆరోపించారు. శుక్రవారం ఆర్‌డీఓ కార్యాలయంలో ఏఓ ఉదయ్ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు వినోద్, వెంకట్ నాయక్ మాట్లాడుతూ.. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 7 గంటలకు వరకు విద్యా సంస్థలను నిర్వహిస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదని విమర్శించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని చైతన్య స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు శివమణి, అఖిల్‌కుమార్, శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: సత్యసాయి జిల్లా, ధర్మవరం పట్టణానికి చెందిన సురువు వెంకటరాముడు జ్ఞాపకార్థం సురువు నాగాంజనేయులు, నాగవేణి దంపతులు శుక్రవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలోని శాశ్వత నిత్యాన్నదాన పథకానికి రూ.99,999 విరాళంగా అందజేశారు. అదేవిధంగా బళ్లారి పట్టణానికి చెందిన సులోచన బాయి అనే భక్తురాలు ఆమె భర్త శ్రీనివాస ప్రసాద్ జ్ఞాపకార్థం ఆలయ నిత్యాన్నదాన పథకానికి రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతల కుటుంబ సభ్యుల పేరున ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నెట్టికంటుడి సేవలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి



తీర్థప్రసాదాలు అందజేస్తున్న ఆలయ అధికారులు

గుంతకల్లు రూరల్: రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి, ఏపీ రియల్ ఎస్టేట్ అప్పీలేట్ అథారిటీ చైర్మన్ ఎం.గంగారావు శుక్రవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం స్వామి వారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

అంతరిక్ష పరిశోధనలపై అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: ఇంజినీరింగ్ విద్యార్థులు అంతరిక్ష పరిశోధనలపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో అంతరిక్ష దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అంతరిక్ష పరిశోధనలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం పోస్టర్ ప్రదర్శన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగం అధిపతి డాక్టర్ గురు సిద్దప్ప విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.